క్లుప్తంగా

గొర్రెలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు



కొరటాంలో గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక సహాయకులు

తెర్లాం: గొర్రెలకు పీపీఆర్ వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సిన్లు శనివారం వేశారు. గొర్రెల కాపరులు వేసిన మందల వద్దకే నేరుగా సచివాలయ పశుసంవర్ధక సహాయకులు వెళ్లి, గొర్రెలకు వ్యాక్సిన్లు వేయడం విశేషం కాగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో గొర్రెలకు ఎక్కువగా పీపీఆర్ వ్యాధి సోకుతుందని, దీనిని వెంటనే పసిగట్టి వ్యాక్సిన్లు వేయాలని తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: ప్రతీ ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని ఎంఈఓ వై.దుర్గారావు సూచించారు. శనివారం మండలంలోని కొత్తమరువాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలన్నారు. మెనూ ప్రకారం వంటకాలు చేసి విద్యార్థులకు పెట్టాలన్నారు.

పరామర్శ



వెంకట వేణుగోపాలనాయుడును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రేగిడి: మండలంలోని అంబకండికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ లావేటి వెంకట వేణుగోపాలనాయుడు తల్లి లావేటి వరహాలమ్మ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, కెంబూరు వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ పాలవలస రామిచంద్రినాయుడు, లావేటి గణపతిరావునాయుడు, లావేటి హరిబాబు శనివారం ఆయన ఇంటికి వెళ్లి, పరామర్శించారు. అనంతరం ఆమె మృతికి సంతాపం ప్రకటించారు.

మజ్జిగౌరమ్మకు పుష్పాభిషేకం



పుష్పాలంకరణలో మజ్జిగౌరమ్మ

రాజాం: మజ్జిగౌరమ్మ తల్లి యాత్ర మహోత్సవాల్లో భాగంగా మండలంలో అంతకాపల్లి గ్రామంలో అమ్మవారికి పలు రకాల పుష్పాలతో శనివారం అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకున్న భక్తులు తమ వెంట తీసుకువచ్చిన గజమాలలు, పువ్వులను అమ్మవారికి సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



లక్ష్మీపురం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీఓ సిమ్మాలమ్మ

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం, చాటాయవలస, వండానపేట గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ పీఓ సిమ్మాలమ్మ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్కడి రికార్డులతో పాటు లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం, వాటి నిల్వ వివరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీ స్కూల్ విధానం సక్రమంగా అమలయ్యేలా చూడాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందివ్వాలన్నారు.

నేడు ఆరాధన

బొబ్బిలి: మండలంలోని కలువరాయిలో అరుణాచల రమణ గణపతి ఆశ్రమంలో ప్రథమ సర్వాధికారి శ్రీనిరంజనానందస్వామి 70వ ఆరాధన కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు రమణ మహర్షి హెరిటేజ్ సంస్థ అధ్యక్షుడు రవీంద్రకుమార్ శనివారం తెలిపారు. కార్యక్రమానికి అందరూ రావాలని ఆయన కోరారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

- గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బాడంగి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, అభిమానులంతా సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. స్థానిక స్వామి కల్యాణ మండపంలో మండల జేసీఎస్ మరిపి శంకరరావు అధ్యక్షతన శనివారం జరిగిన గృహసారథుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, 2024 వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి, వివరించాలని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని, ఇప్పటివరకు 98 శాతం హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నేతలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా లేదని సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజుల వ్యవధిలోనే సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి బాగా పరిపాలన కొనసాగించామని, 175కి 175 శాసనసభ సీట్లు ఎందుకు గెలవమని అంటున్నారన్నారు. జమీందారులను ఓడించి, రైతు బిడ్డను గెలిపించిన గొప్పతనం బొబ్బిలి ఓటర్లకే దక్కుతుందన్నారు. మరోసారి తనను గెలిపించి, బొబ్బిలి వాసుల సత్తా నిరూపించాలన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు.

ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వారికి, ఎల్లో మీడియాకి కనబడదని విమర్శించారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరుగుతున్న మంచిని తెలియజేస్తూ ఓట్లు అడగాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీకి ఘన విజయం అందించాలని కోరారు. సమావేశంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, బుడా చైర్మన్ ప్రతినిధి ఐ.గోపాలరావు, బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షుడు ఎస్. వేణుగోపాలనాయుడు, బొబ్బిలి మండల జేసీఎస్ దామోదరరావు, జెడ్పీటీసీ పి. రామారావు, ఎంపీపీ బి.గౌరి, ఎంపీపీ ప్రతినిధి టి.మధుసూదనరావు, వైస్ ఎంపీపీ బి.రమేష్, ఏఎంసీ డైరెక్టర్ జి.లక్ష్మంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేలలు-పంటల సాగుపై అవగాహన



అంబాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ స్టూడెంట్స్

రేగిడి: ఏ పంటకు ఏ విధమైన నేల అనుకూలమో తెలుసుకుని సాగు చేస్తే అధిక దిగుబడి సాధ్యమని ఎచ్చెర్లకు చెందిన కింజరాపు ఎర్రన్నాయుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ విద్యార్థులు శ్రీవర్ష, సుమన, సుష్మ, వందన తెలిపారు. శనివారం మండలంలోని అంబాడ గ్రామంలో నేలలు-పంటల సాగుపై అవగాహన కల్పించారు. రసాయనాల వల్ల చిత్తడి నేలలు రానురాను అంతరించిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ఆరోగ్యవంతమైన పంటను పొందాలన్నారు. నేలరకం బట్టి తగిన పంటలు వేసుకుంటే మంచిదన్నారు. ఏరువాక కేంద్రం విజయనగరం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో తామంతా వ్యవసాయంపై శిక్షణ పొందామని, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, మహిళా రైతులు పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రంతో కత్తెరపురుగు నివారణ



అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న దృశ్యం

తెర్లాం: అగ్నిఅస్త్రంతో మొక్కజొన్న తదితర పంటలను ఆశించే కత్తెరపురుగు నివారణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని పూనువలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. కిలో పొగాకు కాడలు, కిలో పచ్చిమిరప కాయలు, అర కిలో వెల్లుల్లి పాయలు, మూడు కిలోల వేపాకులను వేర్వేరు ముద్దలుగా చేసి, ఆ ముద్దలను ఓ పెద్దకుండలో తీసుకున్న 15 లీటర్ల ఆవుమూత్రంలో వేసి, మూడు పొంగులు వచ్చేంతవరకు బాగా మరగించాలి. ఈ విధంగా తయారైన మిశ్రమాన్ని రెండు రోజుల పాటు చల్లార్చి, వడకట్టిన తర్వాత ఎకరం పొలానికి 5 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఇలా చేయడం ద్వారా పంటలను ఆశించే కత్తెరపురుగును నివారించవచ్చన్నారు.

నవధాన్యాల సాగుతో నేలకు పోషకాలు



ర్యాలీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం సిటీ:

నవధాన్యాల సాగుతో నేలకు సూక్ష్మపోషకాలు పుష్కలంగా లభిస్తాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ అన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు మే రెండో వారంలో పడే వర్షపుజల్లులకు పెసర, మినుము, ఉలవ, బొబ్బర్లు, శెనగలు వంటి చిరుధాన్యాలను రైతులు చల్లుకోవాలని ఆయన అన్నారు. శనివారం మండలంలోని పొగిరి గ్రామంలో ఉన్న నైరా కళాశాల విద్యార్థులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలతో పాటు ఊదలు, అరికలు, తోటకూర, గోంగూర, చిక్కుడు, బెండ, నూనెగింజలు, దనియాలు, ఆవాలు, మెంతులు వంటి సుగంధ ద్రవ్యాలు, పచ్చిరొట్ట ఎరువులైన కట్టిజనుము, పిల్లిపెసర వంటివి 18 నుంచి 30 రకాల వరకు ఎకరానికి 13 కిలోలు చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించండి



తెర్లాం: సమావేశంలో పాల్గొన్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, ఎంపీపీ ఎస్.ఉమాలక్ష్మి, ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో సఖి మండల స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోరి బాలికల ఆరోగ్యంపై తగిన సలహాలు, సూచనలు అందించాలన్నారు. కిశోరి బాలికలంతా సఖి గ్రూపుల్లో చేరేలా అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలన, దిశ, పోక్సో చట్టాలపై కూడా చైతన్యం కలిగించాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, వివాహాలు జరిపించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ జె.త్రినాథరావు, తెర్లాం పీహెచ్‌సీ డాక్టర్ దీక్షితారాణి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని కోటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సఖిగ్రూపుల సభ్యులతో సమావేశమైన మండల ప్రత్యేకాధికారి శాంతాకుమారి మాట్లాడుతూ కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 9 నుంచి 21 సంవత్సరాల మధ్య వయసు బాలికల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారణకు కృషి చేయాలన్నారు. అలాగే వారిపై ఏ విధమైన దాడులు చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ అక్కారావు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌కుమార్

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సఖి కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. మండల ప్రత్యేకాధికారి వైవీ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ గృహ హింస, భౌతికదాడులు, అవమానాలు, ఇతర హింసాత్మక ఘటనల నుంచి మహిళలకు విముక్తి, కొత్త వెలుగులతో కూడిన జీవితం సఖి కార్యక్రమం ద్వారా పొందవచ్చన్నారు. సఖి కేంద్రం ద్వారా మహిళల స్వావలంబనకు ఉద్యోగులంతా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ ఎస్. శాంతకుమారి, ఎంపీడీఓ ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

రేగిడి: కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరం కృషి చేయాలని హెల్త్ సూపర్‌వైజర్ ఆర్. అప్పలనాయుడు కోరారు. మండలంలోని ఉంగరాడ గ్రామంలో కుష్టువ్యాధి నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రాగి రంగు మచ్చలు, కాళ్లు చేతులు, కండరాల బలహీనత వంటి లక్షణాలు కనిపించిన వెంటనే పీహెచ్‌సీకి వెళ్లి, పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.శైలజ, పుణ్యవతి, ఏఎన్‌ఎం ఎన్‌కే రత్నం తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని నారసింహునిపేటలో స్పర్శ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చంద్రమౌళి, కార్యదర్శి ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్ రాజు కుష్టువ్యాధి నివారణ, నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: ప్రకృతి వ్యయసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ జి.మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ సీహెచ్ శారద సూచించారు. శనివారం మండలంలోని వండానపేట గ్రామంలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవాలన్నారు. వేసవిలో పంట పొలాల్లో నవధాన్యాలు వేసి, జీవవైవిధ్యం పెంచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.చక్రపాణి, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



ఉపకరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక భవిత కేంద్రం ఆవరణలో 13 మంది దివ్యాంగులకు శనివారం ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ఎస్.వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పి.రామారావు, ఎంపీపీ బి.గౌరి, ఎంఈఓ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

బొబ్బిలి: పాతబొబ్బిలి జంక్షన్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా తమలపాకులతో శనివారం అర్చన చేశారు. ఉదయం 8 గంటలకు వేద పారాయణం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి



బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సాంబయ్య

బొబ్బిలి: ఆక్రమణలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సోరు సాంబయ్య కోరారు. శనివారం స్థానిక పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాసేపు మాట్లాడారు. ప్రభుత్వానికి చెందిన కొన్ని వందల ఎకరాల భూమిని పట్టణానికి చెందిన పలువురు పెద్దలు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని, లాండ్ సీలింగ్ యాక్ట్ ద్వారా వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆయన అన్నారు. బొబ్బిలి, రామభద్రపురం ప్రాంతాల్లో చెరువులను కూడా ఆక్రమించుకుంటున్నారని, ఆక్రమణలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. అలాగే అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

గృహ సారథుల శిక్షణ కార్యక్రమం వాయిదా

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించాలనుకున్న పట్టణ గృహసారథుల శిక్షణ కార్యక్రమం వాయిదా వేసినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అధికారులు శనివారం తెలిపారు. త్వరలోనే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని, రెండు రోజుల ముందుగానే తేదీని ప్రకటిస్తామన్నారు.

నేడు గృహసారథుల శిక్షణ కార్యక్రమం

రామభద్రపురం: స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం గృహసారథుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు శనివారం తెలిపారు. కార్యక్రమానికి సచివాలయ కన్వీనర్లు, కొత్తగా నియమితులైన గృహసారథులు, వలంటీర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు.

ఎంపీడీఓ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. అనంతరం అక్కడి రికార్డులు పరిశీలించి, ప్రభుత్వ పథకాల పంపిణీ, ప్రజాసేవలపై ఆరాతీశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాటశిబిరంపై పోలీసుల దాడులు

బొబ్బిలి: మండలంలోని సీతయ్యపేట గ్రామంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శనివారం ఆకస్మికదాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.43,470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్ఐ పి.జ్ఞానప్రసాద్ తెలిపారు.

పోలీసుల అదుపులో విగ్రహ ధ్వంసం కేసు నిందితులు



మాట్లాడుతున్న సీఐ ఉపేంద్ర

రాజాం సిటీ: రేగిడి మండలంలోని సంకిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ నాయకుల విగ్రహాల ధ్వంసం కేసుకు సంబంధించి, ఇద్దరు బాలురును అదుపులోకి తీసుకున్నామని రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్ర శనివారం తెలిపారు. ఈ నెల 1వ తేదీన పాఠశాల ఆవరణలోని గాంధీజీ, అల్లూరి, వివేకానంద, అంబేడ్కర్ తదితర నాయకుల విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. హెచ్‌ఎం సీహెచ్‌వీ లక్ష్మీనారాయణ చేసిన ఫిర్యాదు మేరకు రేగిడి ఎస్ఐ ఇ.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, ఆయా విగ్రహాలను ఇద్దరు బాలురు ధ్వంసం చేసినట్లు తేలడంతో వారిని అదుపులోకి తీసుకున్నామని సీఐ వివరించారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

రాజాం: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. శనివారం మండలంలోని గెడ్డవలస గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన అక్కడి లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. అనంతరం రికార్డులు, సరుకుల నిల్వలను పరిశీలించారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- స్కిల్ హబ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శనివారం స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణలోని నూతన భవనంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ నిశ్చయంతో ఉన్నారని, విద్యార్థుల్లో దాగి ఉన్న స్కిల్స్‌ను వెలికితీసేందుకు నియోజకవర్గానికి ఓ స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేశారని వెల్లడించారు. నిరుద్యోగ యువత అభిరుచికి అనుగుణంగా శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించడమే స్కిల్ హబ్ ధ్యేయమన్నారు. తెలియని కొత్త అంశాలను తెలుసుకుని మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం రాజాం, చీపురుపల్లి ప్రాంతాల్లో స్కిల్‌హబ్‌లో శిక్షణ పూర్తి చేసిన దాదాపు 60 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొందిన అభ్యర్థులకు నియామక పత్రాలు కూడా అందించారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ మేనేజర్ ఎస్.గోవిందరావు, తహసీల్దార్ పి.వి జయభాస్కర్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి, జెడ్పీటీసీ బి.నర్సింహులు, రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రైతు బజారు వద్ద ప్రజలకు గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక రైతు బజారు వద్ద ప్రజలకు వాసవీ క్లబ్ మనరాజాం-సారథి సభ్యులు సమకూర్చిన గుడ్డ సంచులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచులే ముద్దు అనే నినాదాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించి, షాపు యజమానులు, ప్రజలు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ మనరాజాం-సారథి సభ్యులు వి.రాజ, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో వేయొద్దు

తెర్లాం: ప్లాస్టిక్ వ్యర్థాలను వీధి కాలువల్లో వేయవద్దని, గ్రీన్ అంబాసిడర్లు ఇళ్ల ముందుకు వచ్చేటప్పుడు వారి బళ్లలో వ్యర్థాలను వేయాలని మండలంలోని లోచర్ల గ్రామ సర్పంచ్ గర్భాపు దాలమ్మ, పంచాయతీ కార్యదర్శి ఇందిర సూచించారు. పారిశుద్ధ్య పనుల్లో భాగంగా గ్రామంలోని వీధి కాలువల్లో మురుగు, చెత్తాచెదారం శనివారం తొలగించారు. ఈ సందర్భంగా వారు ఎవరి ఇంటి ముందు పరిసరాలు వారు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ఉగాది నాటికి గృహ నిర్మాణాల పూర్తి

తెర్లాం: ఉగాది నాటికి జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను పూర్తి చేయడం జరుగుతుందని జెడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి కె.రాజ్‌కుమార్ తెలిపారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను శనివారం పరిశీలించిన ఆయన ఇళ్ల నిర్మాణాల పరిస్థితులపై మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎం.వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని గెడ్డవలస గ్రామంలో నిర్వహించిన హౌసింగ్ డే కార్యక్రమంలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు లబ్ధిదారులను కోరారు.

బాడంగి: మండలంలోని ఆకులకట్ట గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి శాంతాకుమారి మాట్లాడుతూ సామూహిక గృహ ప్రవేశాల నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ అప్పయ్య, ఎంపీడీఓ అక్కారావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: హౌసింగ్ డేలో భాగంగా మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద నిర్మాణ దశలోని జగనన్న కాలనీ ఇళ్లను మండల ప్రత్యేకాధికారి జి. పెంటోజీరావు పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకుని, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని కొండగూడెం గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి పరిశీలించి, నిర్మాణాలను త్వరితగతం చేయాలని లబ్ధిదారులను కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో వైద్యాధికారి జి.శశిభూషణరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన రక్తదాన శిబిరానికి హాజరైన ఆయన ఆరోగ్యవంతులైన యువతీ యువకులు, విద్యార్థులంతా రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలన్నారు. రక్తం దానం చేస్తే ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదన్నారు. శిబిరంలో రక్తదానం చేసిన గోకుల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ ఆర్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.